మెరుగైన సేవలందించేందుకే వార్డు కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, లాల్‌సింగ్

అబిడ్స్: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే వార్డు కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా సంబంధిత వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే 24 గంటల్లోపు అధికారులు సమస్యలను పరిష్కరిస్తారని ఆమె వివరించారు. గోషామహల్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని బుధవారం బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, కార్పొరేటర్ లాల్ సింగ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు స్వచ్ఛమైన, మెరుగైన బల్దియా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ శానిటేషన్, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, ఇతర ఎలాంటి సమస్యలు ఉన్నా కార్పొరేటర్లు, అధికారులు ప్రత్యేక చొరవతో సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు ముఖేష్ సింగ్, పరమేశ్వరి సింగ్, పలు పార్టీల నాయకులు నట్రాజ్ నామ్‌దారి, ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే, కోఠి శైలేష్ కురుమ, సునిల్ సింగ్, శంకర్‌సింగ్ జమేదార్, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోంద్రే, డిప్యూటీ కమిషనర్ బాలయ్య పాల్గొన్నారు.

మల్లేపల్లి డివిజన్ వార్డు కార్యాలయం ప్రారంభం..



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎస్.ప్రభాకర్‌రావు

నాంపల్లి: వార్డు కార్యాలయాలతో నగర పౌరులకు సేవలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. మల్లేపల్లి డివిజన్ వార్డు కార్యాలయ ప్రారంభోత్సవం బుధవారం బజార్‌ఘాట్‌లో జరిగింది. ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్‌రావు హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, వార్డు ఆఫీసర్లు హిమబిందు, అజీజ్ వున్నీసా, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలి



హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మరింత మెరుగైన విద్యాబోధనకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కార్వాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమంగా విద్యాబోధన జరిగేదని, దీనికి తోడు ఫలితాలు కూడా బాగా వచ్చేవన్నారు. రానురాను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గుతూ వచ్చాయని మౌలిక సదుపాయాలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని అన్నారు. గోల్కొండ, లంగర్‌హౌజ్‌లోని ప్రభుత్వ పాఠశాల భవనాలు వర్షం పడితే లీకేజీలు వస్తున్నాయని ఆయన తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి సమగ్ర నివేదిక తెప్పించుకుంటామని కలెక్టర్ అన్నారు.

'తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సి.రోహిన్‌రెడ్డి

గోల్కొండ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రోహిన్‌రెడ్డి కార్వాన్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నుంచి వలసలు ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజా సంక్షేమం పట్టదని కేవలం కుటుంబ సంక్షేమం కోసమే ఆయన అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ సైతం ప్రజాస్వామ్య విలువలను గౌరవించకుండా కేవలం తమ సొంత ఎజెండాను అమలు పరుస్తుందని ఆయన అన్నారు. చంటిబాబు, అప్సర్ యూసుఫ్ జాహీ, ఎం.రఘుపాల్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, రామ్‌కుమార్, ప్రేమ్‌కిషోర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా...

కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



అబిడ్స్: కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. 57 ఏళ్ల మహిళ వ్యాసిక్యూలర్ సమస్యలతో బాధపడుతుంది. లక్షల్లో ఒక్కరికి వచ్చే ఈ సమస్యను శస్త్ర చికిత్స చేసి డాక్టర్ సంజీవరావు బృందం శభాష్ అనిపించుకున్నారు. ఎంజేమార్కెట్‌లోని కేర్ ఆస్పత్రిలో ఓ మహిళకు సీనియర్ వ్యాసిక్యూలర్ సర్జన్ డాక్టర్ సంజీవరావు ఆధ్వర్యంలో ఐబీఎల్ డివైజ్ ద్వారా ఈ సర్జరీ నిర్వహించారు. సమస్యతో బాధపడుతున్న ఆ మహిళా సర్జరీ అనంతరం సంతోషంగా ఉండి డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపింది. నూతన టెక్నాలజీ ద్వారా ఈ శస్త్ర చికిత్స నిర్వహించామని డాక్టర్ సంజీవరావు వెల్లడించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: బోడుప్పల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాతబస్తీ నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. గోల్డ్ మెడల్‌తో పాటు కాంస్య, సిల్వర్ మెడల్లను సాధించిన విద్యార్థులను బుధవారం ఉప్పుగూడ మహంకాళి ఆలయ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా శశాంక్ తివారీ, టిల్లు, సన్నీ తల్వార్ పాల్గొని విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అకాడమీ మాస్టర్లు గణేష్ నాయక్, మాస్టర్ ప్రకాష్, రాహుల్ మాస్టర్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి



ఓటరు నమోదు కార్యక్రమంలో బీజేపీ నేతలు

గోల్కొండ: అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఆయన బీజేపీ నాయకులతో ఇంటింటికీ తిరిగి ఓటు హక్కు వినియోగం, ఓటరు లిస్టులో పేరు తదితర విషయాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. యాదగిరి, శ్రావణ్‌కుమార్, వినయ్‌చారి, మురళీ తదితరులున్నారు.

సిటీ కాలేజీలో సీటు కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోండి

చార్మినార్: డిగ్రీలో ప్రవేశాల కోసం ఆగస్టు 28 నుంచి ప్రారంభమైన దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా సిటీ కాలేజీలో మిగిలిన సీట్ల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో-50, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో-54, బీఏ సీసీడబ్ల్యూ-12, బీఎస్సీ ఆనర్సు బయోటెక్నాలజీ-19, బీఎస్సీ ఆనర్సు సీ కంప్యూటర్ సైన్స్-18, బీఏ ఆనర్సు ఎకనామిక్స్-14, బీఏ ఆనర్సు హిస్టరీ-8 సీట్లకుగాను విద్యార్థులు సెప్టెంబర్ 4 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చునని తెలిపారు.

ఘనంగా రాఖీ వేడుకలు



ఎంసీహెచ్ ప్లే గ్రౌండ్‌లో.. రాఖీలు కడుతున్న విద్యార్థినులు

జియాగూడ: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని జియాగూడ ఇంద్రాణి మహా విద్యాలయ డైరెక్టర్ ఎం.మిథిలేష్ కుమార్ అన్నారు. బుధవారం జియాగూడ ఎంసీహెచ్ ప్లే గ్రౌండ్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. హెచ్ఓడీ ఎం.ఇంద్రాణి, దివ్యజ్యోతి, ఇన్‌చార్జ్ అర్పన, ప్రైమరీ ఇన్‌చార్జ్ శ్వేత, శిరీష, రాధిక, మహేశ్వరి, సరిత, హేమలత, స్వర్ణలత, అశ్విని, లావణ్య, దీప్తి, రిషిక పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సు



నాణ్యతా ప్రమాణాలను వివరిస్తున్న డాక్టర్ విదిశ

చార్మినార్: ప్రజల దైనందిన జీవితంలో వినియోగించే వస్తువులపై భారతీయ ప్రామాణిక సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్) ప్రమాణాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ హైదరాబాద్ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విదిశ అన్నారు. సిటీ కళాశాల స్టాండర్డ్ క్లబ్, భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హాల్ మార్కింగ్, ఐఎస్ఐ మార్క్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. భారతదేశంలో వస్తు ఉత్పత్తి వినియోగానికి సంబంధించి పాటించాల్సిన ప్రమాణాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. స్టాండర్డ్ క్లబ్‌ల ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని మార్కెట్‌లో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు అన్వయించుకోవాలన్నారు. సిటీ కళాశాల స్టాండర్డ్ క్లబ్ మెంటర్ డాక్టర్ వాసుదేవరెడ్డి, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వినోదిని, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల ఫోరం అధ్యక్షులు అంబు రాథోడ్, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ చిన్నికృష్ణ, డాక్టర్ లక్ష్మీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని గంగపుత్ర సంఘం సమీపంలో బుధవారం ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీల్లో సీవరేజ్ పైప్‌లైన్ వేయడంతో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని.. ఈ విషయమై బస్తీవాసులు తన దృష్టికి తీసుకురావడంతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. గౌలిపురా భారత మాత కోటమైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కైలాష్ గంగపుత్ర, రాజు, కృష్ణ, దాస్, శివ కుమార్, సుమన్‌కుమార్, రఘుకాంత్, మధుసూదన్‌గిరి, వెంకటేశ్, జమాల్‌పూర్ అశోక్, ఉదయ్ కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉత్సవాలకు సహకరిస్తాం'

శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజీపురాకు చెందిన పీస్ కమిటీ సభ్యులు బుధవారం ఛత్రినాక డివిజన్ ఏసీపీ రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీస్ కమిటీ సభ్యులు అబ్దుల్ మాజిద్, మసూద్, మహ్మద్ జుబేర్ మాట్లాడుతూ..వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక నిమజ్జనోత్సవాలు, మిలాన్-ఉన్-నబీ ఉత్సవాలు ఒకేసారి వచ్చాయన్నారు. ఉత్సవాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



ఏసీపీ రమేశ్‌ను సత్కరిస్తున్న పీస్ కమిటీ సభ్యులు

కార్వాన్ బీజేపీ టికెట్ కేటాయించాలని ఈటలకు వినతి



ఈటలకు బయోడేటా అందజేసిన శివ యాదవ్

జియాగూడ: కార్వాన్ నుంచి బీజేపీ టికెట్‌ను తనకే కేటాయించాలని గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ..20 ఏళ్ల నుంచి పార్టీలో సామాన్య కార్యకర్తగా ఉండి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎన్నో పదవులను చేపట్టానన్నారు. జియాగూడ యాదవ సంఘం అధ్యక్షుడు ఐలేష్‌యాదవ్, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, జగదీష్‌యాదవ్, రాజ్‌పాల్, నరేష్, రామ్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనా బేగం సూచించారు. బుధవారం ఆమె పార్టీ నాయకులు, బస్తీ కమిటీ వాసులతో తలాబ్‌కట్టాలోని షాజహాన్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించి గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇళ్లు లేనివారికి ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ పథకాంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్, నాయకు మహ్మద్‌ఖాన్, జఫర్, అక్బర్, మహ్మద్‌ఆలీ, సాబేర్ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సిటీ కళాశాల విద్యార్థుల ప్రదర్శన



చార్మినార్: సిటీ కళాశాల విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల కృషి అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. సాహిత్య అకాడమీ జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర అనే అంశంపై రవీంద్ర భారతిలో రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా సిటీ కళాశాల విద్యార్థులు లావణ్య, పావనీ, శ్వేత జాతీయ నాయకులు, కవుల చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. పావనీ కంచె నుంచి జాలువారిన దేశ నాయకుల చిత్రాలు, లావణ్య బ్లాక్ పెన్సిల్‌తో తీర్చిదిద్దిన కవుల పోర్ట్రెయిట్స్, శ్వేత మలచిన కాఫీ పెయింటింగ్స్ సందర్శకులను అబ్బురపరిచాయి. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని, సాహిత్య అకాడమీ సెక్రటరీ కె.శ్రీనివాస్ రావు, డాక్టర్ పిల్లల మర్రి పినవీర భద్రుడు, శ్రీ సుధామ, ఆచార్య యశ్వి సత్యనారాయణ, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, డాక్టర్ వైసు భాషిణి తదితరులు విద్యార్థుల కృషిని అభినందించారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ విద్యార్థులను, ప్రదర్శన ఏర్పాటు చేసిన తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ నీరజాను అభినందించారు.

టెట్, డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ టెస్ట్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా టెట్, డీఎస్సీలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లాల వారీగా ఉచిత ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ హైదరాబాద్, సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ తెలిపారు. టెట్ అభ్యర్థులకు సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు సబ్జెక్ట్ వారీగా, సెప్టెంబర్ 8 నుంచి 12 టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు ప్రతి ఆదివారం గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామని అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9246208422, 8885555202, 8008954440 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈ-పెట్టీ కేసులో వ్యాపారికి జైలు

అబిడ్స్: ఈ-పెట్టీ కేసులో ఒక్కరోజు జైలు శిక్ష విధిస్తూ 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం ..మెహిదీపట్నం రింగ్‌రోడ్డు పిల్లర్ నెం.93 ప్రాంతంలో మహ్మద్ అమెర్ కేసీటీ మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వేళ సమయం మించి నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులో ఇతర వస్తువులను విక్రయాలు చేస్తున్నాడు. సమయపాలనను పాటించకుండా అర్ధరాత్రి తర్వాత ఇతర వస్తువులు విక్రయిస్తున్న మహ్మద్ అమీర్‌పై గుడిమల్కాపూర్ పోలీసులు ఈ-పెట్టీ కేసు నమోదు చేసి 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ రాజేందర్‌కుమార్ మహ్మద్ అమెర్‌కు ఒక్కరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బావ, బామ్మర్ది గొడవలో ఇరువురికి జైలు

డబీర్‌పురా: బావ, బామ్మర్ది గొడవలో ఇరువురికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..స్టేషన్ పరిధిలో నివాసముండే సయ్యద్ మహమ్మద్ తన సోదరిని సరిగా చూసుకోవడం లేదని కోపంతో బావ సయ్యద్ ఉస్మాన్‌తో గొడవ పడ్డాడు. ఈ విషయంలో ఇద్దరు ఒకరినొకరు కొట్టుకున్నారు. దీనిపై ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో హాజరుపరచగా నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఇరువురికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

హోటల్ నిర్వాహకుడికి జైలు

విజయనగర్‌కాలనీ: నిబంధనలను అతిక్రమించి అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా హోటల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి జైలు శిక్ష విధించారు. ఈ ఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..చార్మినార్ ఖాజీపురాకు చెందిన షేక్ ఫయాజుద్దీన్(37) మెహిదీపట్నం మేరాజ్ ఎక్స్‌రోడ్డులో కింగ్స్ రెస్టారెంట్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా హోటల్ మూసివేయకుండా వ్యాపారం చేస్తుండడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాంపల్లి 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.రాజేందర్ కుమార్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

వ్యక్తి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బాటా సింగారానికి చెందిన మహమూద్ ఖాన్ అలియాస్ పాషా(35) డ్రైవర్. కొంత కాలంగా ఇస్మామియా బజార్‌లో అద్దెకు ఉంటున్నారు. మంగళవారం రాత్రి బెంగళూర్ నుంచి వచ్చి మద్యం సేవించాడు. అన్నం కావాలని స్నేహితులను కోరడంతో వారు తీసుకువచ్చి చూడగా ఫ్యానుకు ఉరివేసుకుని ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. ప్రేమ విషయమై మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నాడు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: మైత్రి కమిటీ సభ్యుల సహకారంతో పండగలు శాంతియుతంగా జరుగుతున్నాయని జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ కట్ట హరిప్రసాద్ అన్నారు. వచ్చే నెలలో జరుగనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకోని బుధవారం షేక్‌పేట్‌లో మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పండుగలు, ఉత్సవాల వేళల్లో నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుందన్నారు. ప్రజలు తమ తమ పండగలను శాంతియుతంగా జరుపుకుంటూ మతసామరస్యాన్ని చాటుకుంటూ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎస్‌హెచ్‌ఓ ఎంజీఎస్ రామకృష్ణ, మైత్రి కమిటీ సభ్యులు జంగయ్య, వేణుగోపాల్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



'రాజాసింగ్ రాజకీయ సన్యాసం తీసుకోవడం ఉత్తమం'



శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: ఎమ్మెల్యే రాజాసింగ్ రాజకీయ సన్యాసం తీసుకోవడమే ఉత్తమమని నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరను అని రాజాసింగ్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాజాసింగ్‌ను బీఆర్ఎస్‌లో ఎవ్వరు ఆహ్వానించలేదన్నారు. రాజాసింగ్‌ను ఏ ఇతర పార్టీలు కూడా చేర్చుకోరని పేర్కొన్నారు. ఆయన కేవలం మతత్వ శక్తులతోనే రాజకీయం చేస్తున్నారన్నారు. పదేళ్లుగా రాజాసింగ్ హయాంలో గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందని, ఈ ఎన్నికల్లో బీజేపీని బీఆర్ఎస్ చిత్తుగా ఓడించి గోషామహల్ నియోజకవర్గాన్ని గ్రేటర్‌లోనే ఒక రోల్డ్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల పరిధిలో మంజూరైన షాదీముబారక్ పథకం చెక్కులను బుధవారం యాకుత్‌పురా ఆల్ ఉస్నా ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్లతో కలిసి అర్హులైన 59 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యలతో పలు ఇబ్బందులకు గురవుతున్న పేద ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలన్నారు. కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, ఆలంధార్ వాలా జహీ, చార్మినార్ తహసీల్దార్ నిహారిక, డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్ ఖాన్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ రేటు తగ్గించడంపై హర్షం



మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో ప్రధానీ మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంటగ్యాస్‌పై మోదీ రూ.200 తగ్గించడంతో 75 లక్షల మందికి ఎల్‌పీజీ కనెక్షన్లు ఇవ్వనుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మయూర్, అనిల్‌యాదవ్, రామకృష్ణ, రేణుక, రాజుయాదవ్ పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీ



తనిఖీల్లో ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, కంచన్‌బాగ్ ఎస్సై హిమారెడ్డి

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్, కంచన్‌బాగ్ ఎస్సై కె.హిమారెడ్డి, పోలీసు సిబ్బందిలతో కలిసి స్టేషన్ల పరిధిలోని జీఎంనగర్, హాఫీజ్‌బాబానగర్ సీ-బ్లాక్, సంతోష్‌నగర్ కాలనీ, ఎంబీ హర్ట్, ఈదిబజార్, భానునగర్, మాదన్నపేట్, ఈద్గా రోడ్డు, మారుతినగర్, రాజీవ్ నగర్, చంపాపేట్ తదితర ప్రాంతాల్లో ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా ఛబుత్రాలు, రోడ్లపై ఉన్న యువకులకు ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్సై హిమారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు.

శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతా రంజిత్ రెడ్డికి బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆమె నివాసంలో కలిసి పూలబొకే అందజేశారు.

'దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అందజేస్తాం'



నిహారిక

యాకుత్‌పురా: ప్రజలకు అందుబాటులో ఉంటూ తమకు అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి జారీ చేస్తామని చార్మినార్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.నిహారిక తెలిపారు. బుధవారం డబీర్‌పురాలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.